మాట్లాడుతున్న నాయకులు

ప్రయివేటులో పుస్తకాల దందా..



యూనిఫారం, బెల్టుల పేరుతోనూ దోపిడీ

పాఠశాలలోనే కొనాలంటూ నిబంధన

రెట్టింపు ధరలకు విక్రయం

ప్రయివేటు పాఠశాలల్లో పుస్తకాల దందా సాగుతోంది. పుస్తకాలతో పాటు యూనిఫారం, టీ షర్టులు, బెల్టుల పేరుతో దోపిడీకి పాల్పడుతున్నారు. ఖచ్చితంగా పాఠశాలలోనే కొనాలంటూ నిబంధన పెట్టి మరీ అమ్ముతున్నారు. రెట్టింపు ధరలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు....

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

తమ పిల్లల భవిష్యత్తు బాగుండాలన్న విద్యార్థుల తల్లిదండ్రుల ఒకే ఒక్క ఆశ కార్పొరేట్, ప్రయివేటు పాఠశాలలకు ఆదాయం తెచ్చి పెడుతోంది. తల్లిదండ్రుల నుంచి పాఠశాలల యాజమాన్యాలు వేలకు వేలు ఫీజుల భారం మోపుతున్నాయి. అడ్మిషన్ ఫీజు, బిల్డింగ్ ఫీజు, కంప్యూటర్ ల్యాబ్, ట్యూషన్, స్పోర్ట్స్, స్పెషల్ డేస్, కమ్యూనికేషన్ ప్రోగ్రాం ఫీజులంటూ ఇప్పటికే వేలాది రూపాయలు వసూలు చేస్తున్న యాజమాన్యాలు మళ్లీ పుస్తకాలు, నోటు పుస్తకాలు, యూనిఫారం, షూ, టీ షర్ట్ అంటూ అందినకాడికి దోచుకుంటున్నాయి. కర్నూలు జిల్లాలో 745 ప్రయివేటు పాఠశాలలు, నంద్యాల జిల్లాలో 559 ప్రయివేటు పాఠశాలలు ఉన్నాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం గుర్తింపు పొందిన పాఠశాలల్లో ప్రభుత్వ పాఠ్యపుస్తకాల్లోని పాఠ్యాంశాలను మాత్రమే బోధించాలి. దీనికి సంబంధించి వారి విద్యార్థుల సంఖ్య ఆధారంగా ఎంఇఒ కార్యాలయం ద్వారా పాఠ్యపుస్తకాలు తెప్పించుకోవాలి. ఆ రేట్లకే విద్యార్థులకు పుస్తకాలను ఇవ్వాలి. నోటు పుస్తకాలు విద్యార్థుల అవసరాన్ని బట్టి తల్లిదండ్రులు సమకూర్చుకోవాల్సి ఉంటుంది. అయితే పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు విక్రయాల్లో ప్రయివేటు పాఠశాలల యాజమాన్యాల ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అడ్డగోలుగా డబ్బులు వసూలు చేసి వ్యాపారం చేస్తున్నాయి. పుస్తకాల కొనుగోలు ధరల కంటే రెట్టింపు వసూలు చేస్తున్నా విద్యాశాఖ అధికారులు మాత్రం నోరు మెదపడం లేదు. నిబంధలకు విరుద్ధంగా యూనిఫాం, టై, బెల్టు, బ్యాడ్జీ, షూ ఇలా అన్నీ తమ దగ్గరే కొనుగోలు చేసి తీరాల్సిందేనంటూ ప్రయివేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు హుకుం జారీ చేస్తున్నాయి, దీంతో తప్పక అడిగిన డబ్బులు చెల్లించి షాపుల్లో మాదిరిగా ప్రయివేటు పాఠశాలల్లో విద్యార్థుల తల్లిదండ్రులు వాటిని కొనుగోలు చేస్తున్నారు మౌలిక వసతుల లేమి, విద్యార్థులకు సరిపడా ఆటస్థలాలు లేవు. తరగతి గదుల కొరత ఉంది. అయినప్పటికీ, అధికారులు మాత్రం అటువైపు కన్నెత్తి చూసిన పాపాన పోలేదు. ఇలా అరకొర వసతులతో పాఠశాలలు నిర్వహిస్తున్నా, ఫీజుల వసూళ్లలో మాత్రం పోటీపడి మరి వసూలు చేస్తున్నారు. ఇది చాలదన్నట్లు పుస్తకాల దోపిడీ అదనంగా ఉంటోంది. ప్రభుత్వ ధరల ప్రకారం ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు పాఠ్య పుస్తకాల ధరలు రూ.280 నుంచి 700 వరకు ఉన్నాయి. వీటికి తోడు అదనంగా నోటు పుస్తకాలు కొనుగోలు చేయాల్సి ఉంది. పెద్ద తరగతులకు నోటు పుస్తకాల ఖర్చు కాస్త ఎక్కువగా ఉంటుందనుకున్నా గరిష్టంగా రూ.1500 మించి ఉండదు. అన్నీ కలిపి పదో తరగతికి కూడా రూ.2 వేలతో పుస్తకాల ఖర్చు సరిపోవాల్సి ఉంది. అయితే ప్రయివేటు పాఠశాలలు ఇష్టానుసారంగా పుస్తకాల ధరల మోత మోగిస్తున్నాయి. ఎల్‌కెజి, యుకెజి తరగతులకే రూ.3 వేలకు పైగా వసూలు చేస్తున్నాయి. పెద్ద తరగతులకు రూ.5 వేల నుంచి రూ.12 వేల వరకు వసూలు చేస్తున్నాయి. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు ఆ వైపు కన్నెత్తి చూడడం లేదు. తమ పిల్లల్ని ఎక్కడ వేధిస్తారోననే భయంతో తల్లిదండ్రులూ ప్రశ్నించడం మానేశారు. కార్పొరేట్ విద్యాసంస్థల్లో పుస్తకాలు, ఇతర సామగ్రి విక్రయాలపై ఎస్‌ఎఫ్‌ఐ ప్రశ్నించినప్పుడు మాత్రమే నామమాత్రంగా అధికారులు వెళ్లి చర్యలు తీసుకుంటున్నారు. అంతేతప్ప దోపిడీని అరికట్టే చర్యలు మాత్రం జిల్లాలో ఎక్కడా కానరావడం లేదు.

విద్యా శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలి

ప్రభుత్వం నిబంధనలు పాటించకుండా ప్రయివేటు పాఠశాలల్లో పుస్తకాల పేరుతో దోపిడీకి పాల్పడుతున్నారు. పుస్తకాలతో పాటు స్టేషనరీ, టీ షర్టు, బెల్టు, షూ అంటూ వసూళ్లకు పాల్పడుతున్నారు. విద్యాశాఖ అధికారులు కూడా ప్రయివేటు, కార్పొరేటు యాజమాన్యాలకే వత్తాసు పలికే విధంగా వ్యవహరిస్తున్నారు. దీంతో ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలల్లో చదివించాలని కోరిక ఉన్న తల్లి దండ్రులను ఫీజులను చూసి భయ పడుతున్నారు. విద్యా శాఖ ఉన్నతాధికారులు, విద్యా శాఖ మంత్రి స్పందించి పుస్తకాల పేరుతో దోపిడీకి పాల్పడు తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి.

- ఎస్.అబ్దుల్లా, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షులు.

మ్యానువల్ పద్ధతిలో బదిలీలు నిర్వహించాలి

- **విద్యాశాఖ అధికారులు వైఫల్యం**
- **ఉపాధ్యాయ సంఘాల నేతలు**
- **డిఇఒ కార్యాలయం ఎదుట నిరసన**

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఎస్‌జిటి ఉపాధ్యాయుల బదిలీలను ఆన్‌లైన్‌లో కాకుండా మాన్యువల్ పద్ధతిలో నిర్వహించాలని ఐక్య ఉపాధ్యాయ సంఘాల నేతలు డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల బదిలీలు పదోన్నతులను నిర్వహించడంలో విద్యాశాఖ అధికారులు వైఫల్యం చెందారని విమర్శించారు. ఆదివారం కలెక్టరేట్లోని జిల్లా విద్యాశాఖ కార్యాలయం ఎదుట ఐక్య ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ నిరసనలో యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు కె. సురేష్ కుమార్, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు యుఆర్‌ఎ రవికుమార్, బి నవీన్ పాటి, ఎస్‌టియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గోకారి, జనార్దన్, ఎపిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు హృదయరాజు, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఇస్మాయిల్ మరియానందం, ఆపాస్ రాష్ట్ర అధ్యక్షుడు సత్యనారాయణ, అప్ట రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రకాష్ రావు, జిల్లా అధ్యక్షుడు సేవాలాల్ నాయక్ తదితరులు మాట్లాడారు. రాష్ట్ర విద్యాశాఖ ఉపాధ్యాయుల బదిలీలను పదోన్న తులను సక్రమంగా నిర్వహించడం లేదన్నారు. బదిలీలను పదోన్నతులను సెలవులు అన్ని అయి పోయిన తర్వాత హడావిడిగా నిర్వహించడంతో పొరపాట్లు జరుగుతున్నా యన్నారు. ఎస్‌జిటి ఉపాధ్యాయుల బదిలీలను మాన్యువల్ పద్ధతిలో నిర్వహిస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు ఆన్‌లైన్‌లో నిర్వహించడం సమంజసం కాదన్నారు. ఉపాధ్యాయులకు బదిలీలలో పదోన్నతుల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి దృష్టి సారించడం లేదన్నారు. సీనియారిటీ జాబితాలను కూడా తప్పుల తడకగా చేస్తున్నారన్నారు. ఈ సమస్యలన్నిటిని పరిష్కరించకపోతే విద్యా భవన్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని వారు హెచ్చరించారు. అనంతరం డిఇఒ ఎస్ శామ్యూల్ పాల్ నిరసన దగ్గరకు వచ్చి యూనియన్ నాయకుల ప్రతినిధి బృందం నుండి వినతి పత్రం స్వీకరించారు. ఈ సమస్యలన్నిటిని రాష్ట్ర ఉన్నత అధికారుల దృష్టికి తీసుకు వెళ్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షుడు హేమంత్ కుమార్, జిల్లా ఆర్థిక కార్యదర్శి యెహోషువ, జిల్లా కార్యదర్శి జిల్లా నాయకులు ఇతర ఉపాధ్యాయ సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్లో గ్రీవెన్స్ కార్యక్రమం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కలెక్టరేట్లో సోమవారం ప్రజా సమస్యలు పరిష్కార వేదిక గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాష ఓ ప్రకటనలో ఆదివారం పేర్కొన్నారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల రెవెన్యూ మున్సిపల్ కేంద్రాల్లో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. బాధితులు నేరుగా ఇక్కడికి వచ్చి తమ వినతులను అందజేసుకోవాలని కోరారు.

వచ్చే నెలాఖరికి బయో మైనింగ్ పూర్తి చేయాలి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

గార్గేయపురం డంప్ యార్డులో జరుగుతున్న బయో మైనింగ్ ప్రక్రియ వచ్చే నెల ఆఖరి నాటికి పూర్తి చేయాలని నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్రబాబు ఆదేశించారు. ఆదివారం ఆయన డంప్ యార్డులో బయో మైనింగ్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ గార్గేయపురం డంప్ యార్డులో కొన్నేళ్ళ క్రితం బయో మైనింగ్ ప్రక్రియను చేపట్టిందని, డంప్ యార్డులో 65 వేల మెట్రిక్ టన్నుల వ్యర్థాలకు చెత్త శుద్ధీకరణ లక్ష్యంగా పెట్టుకోగా, ఇప్పటికి 43 వేల మెట్రిక్ టన్నుల వ్యర్థాలకు బయో మైనింగ్ ప్రక్రియ పూర్తి అయిందన్నారు. మిగిలిన 22 మెట్రిక్ టన్నుల వ్యర్థాలను వచ్చే నెల ఆఖరికి పూర్తి అయ్యేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ట్రామెల్ యంత్రాన్ని వినియోగించుకొని చెత్తను నాలుగు పద్ధతుల్లో ప్రాసెసింగ్ చేస్తారని, ప్లాస్టిక్, ఇనుము, గాజు వస్తువులు, రాళ్లురప్పలను వేర్వేరు చేయడం జరుగుతుందన్నారు. అంతకుముందు కమిషనర్.. ఎ.క్యాంపు, బళ్ళారి చౌరస్తా, ఎస్‌ఎపి క్యాంపు ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించారు. ఎ.క్యాంపులో పలు కాలనీల్లో పారిశుధ్య సమస్యలను గమనించిన కమిషనర్, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఓటీ హోటల్ వద్ద అపరిశుభ్రంగా ఉండటంతో సంబంధిత హోటల్ నిర్వాహకుడిపై అసహనం వ్యక్తం చేశారు. ఎస్‌ఎపి క్యాంపు, బళ్ళారి చౌరస్తా వద్ద నూతన బైపాస్ రహదారిని కమిషనర్ పరిశీలించారు. కార్యక్రమంలో పారిశుధ్య తనిఖీదారుడు మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

జగన్నాథ గట్టులో యోగాంధ్ర

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కర్నూలు నగర శివారులోని జగన్నాథగట్టు పైన రూపాల సంగమేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. కర్నూలు ఆర్‌డిఒ కిలారి సందీప్ కుమార్ ఆధ్వర్యంలో యోగా కార్యక్రమం నిర్వహించారు. యోగా శిక్షకుల ఆధ్వర్యంలో యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా కర్నూలు ఆర్‌డిఒ మాట్లాడుతూ ఇక్కడ నిర్వహించిన కార్యక్రమాన్ని చాలా విజయవంతం చేశారన్నారు. ఇదే స్ఫూర్తితో ఈనెల 21న నిర్వహించనున్న ప్రపంచ యోగా దినోత్సవం కార్యక్రమంలో కూడా పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. సెట్కూరు సిఇఒ వేణుగోపాల్ మాట్లాడుతూ ఈనెల 21న జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవంలో కూడా ఇదే స్ఫూర్తితో ప్రజలందరూ పాల్గొనాలని కోరారు... కార్యక్రమం లో దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సుధాకర్ రెడ్డి, సైనిక్ వెల్ఫేర్ అధికారి, కర్నూలు మండల తహసీల్దార్ రమేష్, దిన్నెదేవర పాడు సర్పంచి మాధవస్వామి, తాండ్రపాడు సర్పంచి జయన్న, టిడిపి నాయకులు పెరుగు పురుషోత్తమ్ రెడ్డి, యోగా అసోసియేషన్ కార్యదర్శి అవినాష్, యోగ శిక్షకులు, ప్రజలు పాల్గొన్నారు.

యోగాసనాలు వేస్తున్న అధికారులు, ప్రజలు

యోగాసనాలు వేస్తున్న ఆర్‌డిఒ, ఇతర అధికారులు

పరిశీలిస్తున్న కమిషనర్

రైల్వేస్టేషన్‌నుంచి సైకిల్ రన్‌ను ప్రారంభిస్తున్న ఆర్‌పిఎఫ్ ఇన్‌స్పెక్టర్ రామ్మోహన్

సైక్లింగ్‌తో ఆరోగ్యం

- సైక్లింగ్ సండే ను నిర్వహించిన శాయి సెంటర్

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్

ప్రతిరోజు క్రమం తప్పకుండా సైక్లింగ్ చేయడం ద్వారా ఆరోగ్యంతో పాటు ఫిట్నెస్ లభిస్తుందని కర్నూలు రైల్వే స్టేషన్ మాస్టర్ శేష ఫణి అన్నారు. ఆదివారం స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (శాయి) ఆధ్వర్యంలో సైక్లింగ్ ర్యాలీని ఆర్‌పిఎఫ్ ఇన్‌స్పెక్టర్ రామ్మోహన్, చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ మున్నాజీరావుతో కలిసి జండాఊపి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ఆరోగ్యకరమైన జీవనం కోసం ప్రతిరోజు సైక్లింగ్ చేయాలని సూచించారు. 26 వారాల పాటు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (శాయి) వారు పర్యావరణ పరిరక్షణలో భాగంగా సైక్లింగ్ సండేస్ పేరుతో కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఇన్చార్జి చంద్రశేఖర్, సైక్లింగ్ కోఆర్డినేటర్ కార్తికేయన్, అసిస్టెంట్ కోఆర్డినేటర్ జతిన్, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఎస్‌ఎల్‌ఎన్‌ఎస్ కన్వెన్షన్ హాల్ ప్రారంభం

ప్రజాశక్తి- కోడుమూరు రూరల్

కోడుమూరు మండల కేంద్రంలోని కర్నూలు రోడ్ సమీపంలో అన్ని హంగులతో కూడి నిర్మించిన ఎస్‌ఎల్‌ఎన్‌ఎస్ కన్వెన్షన్ ఎసి ఫంక్షన్ హాలును ఆదివారం టి.వీరన్న బంధుమిత్రులు, స్నేహితులతో కలిసి ప్రారంభించారు. టి.వీరన్న మాట్లాడుతూ వివాహాది శుభకార్యాలు, పుట్టినరోజు వేడుకలు తదితర అన్ని రకాల శుభకార్యాలకు అనుకూలంగా విశాలమైన ప్రత్యేకమైన గదులతో నిర్మించామన్నారు. సెంట్రల్ ఎసి కూడా ఏర్పాటు చేసామన్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి వచ్చిన అతిథులు కర్నూలు మాజీ ఎమ్మెల్యే ఎంఎ గఫూర్, సిపిఎం కర్నూలు జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పిఎస్ రాధాకృష్ణ, ఎండి.అంజిబాబు, కెవి.నారాయణ, జెఎన్ శేషయ్యలను శాలువాలు కప్పి మెమెంటో అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి రాజు, గఫూర్‌మియ్యా, జిపి పెద్ద వీరన్న, లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

కోడుమూరులో ప్రారంభించిన ఎస్‌ఎల్‌ఎన్‌ఎస్ కన్వెన్షన్

బాలికపై అత్యాచారానికి పాల్పడిన వారిని శిక్షించాలి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

శ్రీ సత్యసాయి జిల్లా రామగిరి మండలం ఏడు గుర్రాలపల్లెలో దళిత మహిళను మొదట ఒక పోకిరి వెధవ అత్యాచారం చేసి వాటిని మొబైల్‌లో రికార్డ్ చేసి ఆ వీడియోని చూపిస్తూ వాడు వాడి మిత్రులు 14 మంది దాదాపు ఆరు నెలల నుండి అత్యాచారానికి పాల్పడినట్లు తెలిసింది. ఈ అత్యాచారంలో పాల్గొన్న 14 మందిపై ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని ఐద్వా డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కె.అరుణ, ఎన్.అలివేలు, రాఘవేంద్ర, నగేష్ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అత్యంత దుర్మార్గంగా కూటమి ప్రభుత్వం రోజు మహిళలను ఉద్ధరిస్తున్నట్టు కాపాడుతున్నట్టు ఫోజులు కొట్టడం తప్ప మహిళలకు రక్షణ కల్పించడంలో మహిళలను లైంగిక దాడుల నుండి, అత్యాచారాల నుండి కాపాడడంలో ఘోరంగా వైఫల్యం చెందుతున్నారని విమర్శించారు. అత్యాచారానికి పాల్పడిన నిందితులను అందరిని తక్షణమే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అత్యాచారానికి పాల్పడిన వారిపట్ల ఆ నియోజకవర్గం ఎమ్మెల్యేలు, టిడిపి నాయకులు పోలీసులపై ఒత్తిడి చేసి అత్యాచార ఘటనలో పాల్గొన్న యువకులని కాపాడాలను కోవడం సిగ్గుచేటని అన్నారు. ఇలాంటి కీచకులను కాపాడితే టిడిపి, జనసేన ,బిజెపి కూటమి ప్రభుత్వానికి ప్రజలు గట్టిగా బుద్ధి చెప్పాల్సి వస్తుందని హెచ్చరించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం మహిళలకు గట్టి భద్రత చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. రోజు ఏదో ఒకచోట రాష్ట్రంలో దేశంలో ఇలాంటి కీచకులకు మహిళలు బలవుతున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గొప్ప మాటలు తప్ప చేతల్లో మీరు చేసేది శూన్యమని అన్నారు. ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్న వెంటనే నిందితులందరినీ అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలన్నారు. అత్యాచారానికి గురైన దళిత మైనర్ బాలికను ప్రభుత్వం పూర్తిగా బాధ్యత తీసుకొని మంచి విద్యాసంస్థలో చేర్పించి వారి కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. ఇప్పటికే ఆ కుటుంబం అధికార పార్టీ నాయకుల భయంతో ఇల్లు వదిలి తలదాచుకునే దుర్భర పరిస్థితి ఏర్పడిందన్నారు. అలాంటి కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలిచి ధైర్యం చెప్పి నిందితులను శిక్షించి, బాధిత కుటుంబాన్ని సంపూర్ణంగా అన్ని విధాలుగా ఆర్థికంగా, సామాజికంగా ఇబ్బంది పడకుండా కాపాడాలని కోరారు. నిందితులను కాపాడడంలో ఏమాత్రం రాజీ పడిన చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు.

మానవత్వాన్ని చాటుకున్న డాక్టర్ శంకర్‌శర్మ

- వృద్ధాశ్రమానికి నెల రోజుల నిత్యవసరాలు పంపిణీ

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కర్నూలుకు చెందిన ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్యులు శంకర్ శర్మ మానవత్వాన్ని చాటుకున్నారు. కర్నూలు సమీపంలోని జి.పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాల వద్దనున్న టిజివి నగర్‌లోని కృపావృద్ధాశ్రమానికి డాక్టర్ శంకర్ శర్మ నిత్యవసర సరుకులు అందజేశారు. మతిస్థిమితంలేని దాదాపు 30 మంది వృద్ధులకు కృపా వృద్ధాశ్రమంలో నిర్వహకులు అబ్రహం ఆశ్రయం కల్పించి వారిని పోషిస్తున్నారు. విషయం తెలుసుకున్న డాక్టర్ శంకర్ శర్మ ఆదివారం ఆశ్రమానికి వెళ్లి మానసిక వికలాంగులకు నిత్యవసర వస్తువులు అందించారు. ఈసందర్భంగా డాక్టర్ శంకర్ శర్మ మాట్లాడుతూ మానసికంగా సరిగా లేని వారికి ఆశ్రయం కల్పించి వారికి సేవలు చేయడం ఎంతో గొప్ప విషయం అన్నారు. ఇలాంటి ఆశ్రమాలను నిర్వహించే వారికి సహాయం చేయాల్సిన అవశ్యకత ఎంతైనా ఉందన్నారు. నిస్వార్థంగా ఇలాంటి కార్యక్రమం నిర్వహిస్తున్న అబ్రహం కుటుంబ సభ్యులను డాక్టర్ శంకర్ శర్మ అభినందించారు. భవిష్యత్తులో ఆశ్రమానికి తనవంతు సహాయసహకారాలు అందిస్తానని తెలిపారు. ఈకార్యక్రమంలో కృపా వృద్ధాశ్రమం నిర్వాహకులు అబ్రహం పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి నెల రోజుల నిత్యవసరాలు పంపిణీ చేస్తున్న డాక్టర్ శంకర్ శర్మ

జులై 11,12న డివైఎఫ్‌ఐ జిల్లా మహాసభలు

- జయప్రదానికి అధ్యక్ష, కార్యదర్శులు పిలుపు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

డివైఎఫ్‌ఐ జిల్లా 19వ మహాసభలు జులై 11, 12 తేదీల్లో నిర్వహిస్తున్నామని, యువత పాల్గొని జయప్రదం చేయాలని డివైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాఘవేంద్ర, నగేష్ కోరారు. ఆదివారం డివైఎఫ్‌ఐ కర్నూలు మండల సమావేశం కర్నూలు నగరంలోని డివైఎఫ్‌ఐ జిల్లా కార్యాలయంలో మండల కార్యదర్శి ప్రకాష్ అధ్యక్షతన నిర్వహించారు. డివైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాఘవేంద్ర,నగేష్ మాట్లాడుతూ డివైఎఫ్‌ఐ 1980లో ఏర్పడిన నాటి నుండి నేటి వరకు అనేక ఉద్యమాలకు శ్రీకారం చుట్టిందని అన్నారు. అవినీతిఅంతం డివైఎఫ్‌ఐ పంతం అనే నినాదంతో పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహించిందని అన్నారు. గ్రామీణ ప్రాంతాలు, పట్టణ ప్రాంతాల అభివృద్ధిలో కీలకపాత్ర పోషించిందన్నారు. గంజాయి, సారా, మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా పోరాడి మత్తు నుండి యువతను మంచి మార్గం వైపు నడిపించడం కోసం కృషి చేసిందన్నరు. దేశ ఐక్యత కోసం ప్రాణాలు ఇచ్చిన చరిత్ర డివైఎఫ్‌ఐదని అన్నారు. అలాంటి డివైఎఫ్‌ఐ జిల్లా 19వ మహాసభలు జులై 11,12 తేదీలలో కర్నూలు నగరంలో నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆ మహాసభలలో యువతీ యువకులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలన్నారు. నిరుద్యోగం లేని భారతాన్ని, అసమానతలు లేని సమాజాన్ని నిర్మించుకోవాలని కోరారు. ఈ సమావేశంలో డివైఎఫ్‌ఐ జిల్లా నాయకులు అబ్దుల్లా, మండల నాయకులు హరి కిషన్ రెడ్డి, అంజి, విశ్వనాయుడు, సుధాకర్, రాము షక్షావలి, సద్దాం పరశురాం, హరి, నబి, చాణిక్య శివ, రఘువరన్, పృధ్వి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నాయకులు

ఇఏపిసెట్ ఫలితాల్లో 'నారాయణ' ప్రతిభ

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఇఎపిసెట్ ఇంజినీరింగ్, అగ్రికల్చర్ , ఫార్మశీ విభాగంలో నారాయణ విద్యా సంస్థలకు చెందిన విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులను సాధించారు. అగ్రికల్చర్, ఫార్మసీలకు సంబంధించి డి.హేమసాగరిక 21వ ర్యాంకు, ఆర్.గోవర్ధన్ చౌదరి 65వ ర్యాంకు, సఫా సైఫ్ ఖురైషి 90వ ర్యాంకు, పి.దీపిక 102వ ర్యాంకు, ఎం.అఖిల్ బాలాజీ నాయక్ 104వ ర్యాంకు, వి.గురు పార్థివ్ 124వ ర్యాంకు, ఎం.సంహిత 213వ ర్యాంకు, డి.శ్రీసాయి పనేంద్ర 237వ ర్యాంకు, ఎం.కార్తీక్ 320వ ర్యాంకు, కె. గౌతమి 353వ ర్యాంకు, ఆర్.దివ్యశ్రీ 397వ ర్యాంకులను కైవసం చేసుకున్నారు. ఇలాంటివి మరెన్నో ర్యాంకులు సాధించారు. ఈ విభాగంలో 500 లోపు ర్యాంకులు 3, 2000 లోపు 14, 3000 లోపు 23, 5000 లోపు 42, 10 వేలలోపు 90, 15 వేల లోపు 140, 20వేల లోపు 206, 30 వేల లోపు 349, 40 వేల లోపు 477, 50 వేల లోపు 615 మంది ర్యాంకులు సాధించడం విశేషం.

ఇంజనీరింగ్ సంబంధించి కె.చరణ్ కుమార్ 220వ ర్యాంకు, టి.మిథున్ సాయి కుమార్ 232వ ర్యాంకు, కె.జీవన్ కుమార్ 305వ ర్యాంకు, కె.సాయి శ్రుతి 1136వ ర్యాంకు, జి.శివ శ్రీనివాస్ 1332వ ర్యాంకు, ఎస్.ఖరాన్న 1445వ ర్యాంకు, డి.ధరణి 1503వ ర్యాంకు, కె. సాయిభాస్కర్ 1565వ ర్యాంకులు పొందారు. ఈ సందర్భంగా కళాశాలలో సాయంత్రం ఏర్పాటుచేసిన అభినందన కార్యక్రమంలో విద్యార్థులను అభినందించారు. కళాశాల డిజిఎం టి.గోవర్ధన్ రెడ్డి, డీన్లు ఆంజనేయ రెడ్డి, విశ్వనాథ్ రెడ్డి, వేణు గోపాల్‌రెడ్డి, కె.వెంకటేశ్వర్లు, ప్రిన్సిపల్ పి. సుజాత, కె.హవీల సమ్రాట్, బి.విజయ మోహన్, టి. కౌసల్య, సాంబశివా రెడ్డి, పి.సూర్య కుమారి, జి.రేవతి, వెంకటరాముడు, ఎ. సరిత, ఖైరునిసా బీ, ఎ. సుధాకర్ రెడ్డి, కె.రామసుబ్బారెడ్డి, ఎం.రామ్ మోహన్ రెడ్డి, కె.కృష్ణారెడ్డి, కె.సుబ్బారాయుడు, తదితరులు పాల్గొని విద్యార్థులను అధ్యాపకులను అభినందించారు.



K CHARAN KUMAR H.T.NO. 550370010187 RANK : 220

T MITHUN SAI KUMAR H.T.NO.550370040027 RANK : 232

K JEEVAN KUMAR H.T.NO.550770010148 RANK : 305

K SAI SRUTHI H.T.NO.550270040065 RANK : 1136

D HEMA SAGARIKA H.T.NO.951270060053 RANK : 21

R GOVARDHAN CHOWDHARI H.T.NO.951470040086 RANK : 65

SAFA SAIF QURAISHI H.T.NO.951370010264 RANK : 90

P DEEPIKA H.T.NO.951170070088 RANK : 102

M AKHIL BALAJI NAIK H.T.NO.951170020071 RANK : 104

నేడు మార్కెట్ యార్డ్ చైర్మన్ ప్రమాణ స్వీకారం

తొలిసారి కురువ సామాజిక వర్గానికి చైర్మన్ పదవి

ప్రజాశక్తి-ఎమ్మిగనూరు రూరల్

ఎమ్మిగనూరు నియోజకవర్గం రైతులు పంటలు అమ్మటంలో వ్యవసాయ మార్కెట్ యార్డ్ ప్రముఖ పాత్ర పోషిస్తుంది. గత ప్రభుత్వంలో పాలకులు మార్కెట్ యార్డులో అనేక అక్రమాలకు పాల్పడి మార్కెట్ ఆదాయానికి గండి కొట్టారనే ఆరోపణలు వచ్చాయి. సోమవారం ప్రమాణ స్వీకారం చేయనున్న కురువ మల్లయ్య రైతు కుటుంబంలో జన్మించి రైతుగా జీవనం సాగిస్తున్న తరుణంలో చైర్మన్ పదవి వరించడంతో ఎమ్మిగనూరు నియోజకవర్గ రైతులకు మంచి పరిపాలన జరగాలని ఆశిస్తున్నారు. ఎమ్మిగనూరు నియోజకవర్గంలో మార్కెట్ యార్డ్ ఏర్పాటయినప్పటినుంచి ఇప్పటివరకు కురువ సామాజిక వర్గానికి కనీసం డైరెక్టర్ పదవి కూడా దక్కలేదు. ఈ సంవత్సరం నేరుగా చైర్మన్ పదవి పెద్దమరివీడు గ్రామానికి చెందిన కురవ మల్లయ్యకు రావడంతో నియోజవర్గంలోని కురువ సంఘాల నాయకులు, కురువలందరూ సంతోషం వ్యక్తపరిచారు. ఈ సందర్భంగా కురువ మల్లయ్య మాట్లాడుతూ నాకు ఈ పదవి రావటానికి మా ఎమ్మెల్యే బివి. జయ నాగేశ్వర్ రెడ్డి ఎంతో కృషి చేశారని, ఆయన మా కులం పట్ల చూపుతున్న చొరవ, నా కుల సామాజిక వర్గాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్తున్నట్లు తెలిపారు. బివి జయ నాగేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మిగనూరు వ్యవసాయ మార్కెట్ యార్డ్ ను అభివృద్ధి చేయడానికి కషి చేస్తానన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు, ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

కురువ మల్లయ్య

సిఎంకు, ఎమ్మెల్యేకు ధన్యావాదాలు

కురువ మద్దిలేటి, కురువ సంఘం రాష్ట్ర నాయకుడు

నియోజకవర్గంలో వ్యవసాయ మార్కెట్ యార్డ్ చరిత్రలోనే మా కురువ కులానికి చెందిన ఒక్క పదవి కూడా దక్కక లేదు. అయితే ఈ సంవత్సరం ఎమ్మెల్యే బివి. జయ నాగేశ్వర్ రెడ్డి కురువ కులస్తులు చాలా మంచి వ్యక్తులని కురువ సమాజిక వర్గానికి చెందిన కురవ మల్లయ్యకు వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ పదవి ఇచ్చినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రికి, నారా చంద్రబాబు నాయుడు ఎమ్మెల్యే బివి.జయ నాగేశ్వర్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు.

మునిసిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

-రూ. 26 వేల కనీస వేతనం ఇవ్వాలి- సమ్మెకు సిఐటియు సంపూర్ణ మద్దతు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులకు రూ.26 వేల కనీస వేతనం ఇవ్వాలని 33వ రోజు సమ్మెకు సిఐటియు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు సిఐటియు మండల కార్యదర్శి బి రాముడు తెలిపారు. ఆదివారం సిఐటియు బృందం సమ్మెకు మద్దతు తెలిపారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తే సమ్మెను ఉదృతం చేస్తామని హెచ్చరించారు. సిఐటియు మండల కార్యదర్శి బి రాముడు మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు కే ఇస్మాయిల్ బి మునీంద్ర మద్దతు తెలిపిన సందర్భంగా మాట్లాడుతూ 25 సంవత్సరముల నుండి ఇంజనీరింగ్ కార్మికులు వాటర్ సెక్షన్ లైటింగ్ సెక్షన్ యుజిడి సెక్షన్ పార్కింగ్ సెక్షన్ అడ్మినిస్ట్రేషన్ సెక్షన్ తదితర సెక్షన్లలో చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్నారని కేవలం రూ.15 వేలు మాత్రమే ప్రభుత్వం ఇస్తుందని కానీ సమాన పనికి సమాన వేతనం ఇవ్వకుండా కనీస వేతనం 26వేలు ఇవ్వకుండా సెలవులు ఇవ్వకుండా శ్రమ దోపిడీ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వీఐపీలు, మంత్రుల పర్యటన సందర్భంగా విరామం లేకుండా డ్యూటీలు చేస్తున్నారని ఇటువంటి కార్మికులను గత ప్రభుత్వం ఇంజనీరింగ్ కార్మికులను పట్టించుకోకుండా వేతనాలు పెంచకుండా మోసం చేసిందని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు సమ్మె శిబిరంలోకి వచ్చి ఇంజనీరింగ్ కార్మికులకు కనీస వేతనం పెంచుతాం రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇస్తాం హామీ ఇచ్చినా సంవత్సరం కావస్తున్న కార్మికుల గురించి సాక్షాత్తు మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలను పట్టించుకోకుండా కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. ఉద్యోగులుగా గుర్తించి వీరికి రావలసిన సంక్షేమ పథకాలను కోత కోయడం అన్యాయమన్నారు. కుటుంబ సభ్యులకు పిల్లలకు సంక్షేమ పథకాలు మంజూరు చేయించాలని డిమాండ్ చేశారు. తక్షణమే పురపాలక శాఖ మంత్రి, సీఎం చర్చలకు పిలిపించి వేతనాలు పెంచే విధంగా ఇతర సమస్యలు పరిష్కరించాలని సమ్మె విరమింపు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ కార్మికులు వెంకటేష్, నరసింహులు, ప్రేమ్ కుమార్, బడిషా రంగస్వామి, కేసన్న, నాగరాజు, కాజా పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమ్మెకు మద్దతు తెలిపి మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

వంటావార్పుతో మున్సిపల్ కార్మికుల నిరసన

ప్రజాశక్తి - ఆదోని

చాలీచాలని వేతనాలతో కనీస అవసరాలు కూడా తీర్చుకోలేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని తమ సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ కాంట్రాక్ట్ వర్కర్స్ చేపట్టిన నిరసన ఆదివారం ఐదో రోజు చేరుకుంది. యూనియన్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయంలోనే నీటి ట్యాంకు వద్ద వంటావార్పు చేసి నిరసన చేపట్టారు ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు పిరా సాహెబ్, సోమన్న మాట్లాడారు. దశాబ్ద కాలంగా చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్నామన్నారు. టెక్నికల్ ఉద్యోగులకు 29,500, నాన్ టెక్నికల్ 24,500 వేతనం ఇవ్వాలని ఎన్ని సార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేకపోవడంతో పోరు బాట పట్టామన్నారు. న్యాయమైన సమస్యలు పరిస్కారంకు అడుగులు పడే వరకు పోరు కొనసాగిస్తామన్నారు. పగలు రాత్రి విధులు నిర్వర్తించి కష్టపడి సేవలందిస్తున్న తమ కష్టం ప్రభుత్వానికి కనపడదా అంటూ నిలదీశారు వర్కర్స్ నాయకులు హమ్మద్, భరత్, ఈరన్న, రామాంజనేయులు, ఆంజనేయులు, కుమార్ ,కరేప్ప, శరత్, శంకర్, మహమ్మద్ ,బసవరాజు, దేవేంద్ర, శివకుమార్ ఉన్నారు

సమ్మెలో ఆదోనిమున్సిపల్ ఇంజనీరింగ్ కాంట్రాక్టు కార్మికులు

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

మద్యంతాగి వాహనాలు నడిపితే చర్యలు: ఎస్ఐ

ప్రజాశక్తి-చిప్పగిరి

చెడు వ్యసనాలకు అలవాటు పడకుండా దూరంగా ఉండాలని యువకులకు ఎస్ఐ ఎపి శ్రీనివాసులు సూచించారు. ఆదివారం చిప్పగిరి పోలీస్ స్టేషన్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈ మధ్యకాలంలో ఎక్కువగా యువత పార్టీల పేరుతో మోతాదు మించి తాగి వాహనాలు నడుపుతున్నారని, అది ప్రమాదకరమన్నారు. చేతులారా జీవితాలను బుగ్గిపాలు చేసుకోవడం, కుటుంబాలను అనాథలుగా చేయడం మంచిది కాదన్నారు. మనపై ఆధారపడే వారు ఉన్నారని తెలుసుకోవాలని యువకులను కోరారు. ఎంత స్నేహాలు ఉన్నప్పటికీ ఇంటిలోని కుటుంబ సభ్యులను మరవకూడదన్నారు. మనకు ఏదైనా అయితే మన కుటుంబ సభ్యులు ఎంత అల్లాడుతారో ఒకసారి ఆత్మసాక్షిగా పరిశీలన చేసుకోవాలన్నారు. గ్రామాలలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయన్నారు. గ్రామాలలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే అటువంటి వారి గురించి ఎవరైనా సరే సమాచారం ఇవ్వాలని, వివరాలు కూడా గోప్యంగా ఉంచుతామన్నారు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మళ్లీ కుంగిన ఎస్ఎస్ ట్యాంక్

-పురవాసులకు తాగునీటి కష్టాలు తప్పవా -పట్టని ప్రజాప్రతినిధులు, అధికారులు

ప్రజాశక్తి-ఆదోని

పాలకులు,అధికారుల ముందు చూపు కొరవడంతో ఆదోని ప్రజలకు నీటి కష్టాలు ఎదురయ్యే అవకాశాలున్నాయి. కావలసినంత ఆదాయం మున్సిపాలిటీకి వస్తున్నా కనీస మౌలిక సదుపాయాలు కల్పనలో మాత్రం నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనపడుతుందని పలువురు పేర్కొం టున్నారు. ఆదోని ప్రజల దాహార్తి తీర్చే బసాపురం సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ పటిష్టత రోజురోజుకు తరుగుతుండడంతో ఆందోళన కలిగిస్తున్న పరిస్థితి. తాగునీటిని నిలువ ఉంచడంలో కూడా నిర్లక్ష్యం వహిస్తున్నారని తెలుస్తోంది. కూటమి ప్రభుత్వ అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా ఆదోని అభివృద్ధి కోసం ఎలాంటి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవని ప్రజలు విమర్శిస్తున్నారు. స్టోరేజ్ ట్యాంకులో నీరు తగ్గిపోతోంది. కనీసం నివారణ చర్యలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి ఎమ్మెల్యే అధికారులతో చర్చించిన దాఖలాలు లేవని పలువురు చెబుతున్నారు. వాటాలపై ఉన్న శ్రద్ధ ప్రజల బాగోగులపై పాలకులు చూపడం లేదన్న విమర్శలు వినపిస్తున్నాయి. బసాపురం సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు మళ్లీ కుంగిపోతున్నా... కనీస్పందన లేదు.

ముంచుకొస్తున్న నీటి కష్టాలు: ఆదోని పట్టణం రోజురోజుకు విస్తరిస్తోంది. 2004లో జనాభాను దృష్టిలో పెట్టుకొని ట్యాంక్ నిర్మాణం చేపట్టారు. బసాపురం సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ సామర్థ్యం 3110 మిలియన్ లీటర్లు, రామజల చెరువు 1000 మిలియన్ లీటర్ల నీటి నిల్వ ఉండేలా నిర్మాణం చేశారు. ప్రస్తుతం ఆదోని మున్సిపాలిటీ పరిధిలో సుమారు రెండు లక్షల జనాభా ఉంది. రోజుకు బసాపురం సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ నుండి 26 మిలియన్ లీటర్లు, రామజల చెరువు నుండి 4 మిలియన్ లీటర్లు చొప్పున 30 మిల్లీలీటర్లు రోజుకు అవసరం బసాపురం సమ్మర్ స్టోర్ బ్యాంకులో 1000 మిలియన్ లీటర్లు రామజల చెరువులో 350 మిల్లీలీటర్లు నీరు నిల్వ ఉంది. ఈ నీరు ఆదోని పురవాసులకు 30 రోజులకు సరిపోతున్నాయని అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే రాయ నగర్, క్రాంతినగర్ ,విజయభాస్కర్‌రెడ్డి నగర్, వైయస్సార్ నగర్ , అమరావతి నగర్ ప్రాంతాలకు తాగునీరు సక్రమంగా సరఫరా కావడం లేదని ఆ కాలనీవాసులు చెబుతున్నారు. మూడు రోజులకు ఒకసారి నీరు సరఫరా అవుతుందని, ఇప్పుడే పరిస్థితి ఎలా ఉంటే ముందు ముందు ఎలా ఉంటుందో అన్న ఆందోళన వ్యక్తం అవుతుంది.

నాలుగు రోజులకు ఒకసారి తాగునీరు : బసాపురం సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు, రామజల చెరువులో నీటి నిల్వను దృష్టిలో ఉంచుకొని నాలుగు రోజులకు ఒకసారి నీరు సరఫరా చేయాలని మున్సిపల్ చైర్ పర్సన్ లోకేశ్వరి అధికారులకు సూచించారు. చేతిపంపులు, ట్యాంకులు, బోర్ల మరమ్మతులు చేయించి వాడుకునేందుకు నీటి కొరత రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. నీటి వృధాను చేయొద్దని ఉచిత సలహాలు ఇచ్చి చేతులు దులుపుకుంటున్న పరిస్థితి కనపడుతుందని పాలకుల తీరుపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

తుంగభద్ర కాలువలో నీరు ఇప్పట్లో లేనట్లే: తుంగభద్ర డ్యాం నుండి కాలువ ద్వారా తాగునీటి అవసరాల నిమిత్తం నీరు సరఫరా కావలసి ఉంది. ప్రస్తుతం తుంగభద్ర దిగువ కాలువ మర మ్మతు పనులు జరుగుతున్నాయి. డ్యాములో కూడా నీరు పుష్కలంగా ఉన్నప్పటికీ మరమ్మతులు జరుగు తూ ఉండటం వల్ల ఇప్పట్లో నీరు వదిలే అవకాశాలు లేనట్లు కనపడుతున్నాయని అధి కారులు చెబుతున్నారు. తుంగభద్ర దిగువ కాలు వకు నీరు వస్తేనే బసాపురం సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుకు పంపింగ్ చేసుకునే సౌకర్యం ఉంది. ప్రజా అవసరాలు దృష్టిలో ఉంచుకొని సకాలంలో నీళ్ల వదిలేలా చూడాలని తుంగభద్ర డ్యామ్ అధికారులను కోరుతామని కౌన్సిలర్లు చెబుతున్నారు.

కుంగిన బసాపురం చెరువు కట్ట: బసాపురం సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ సైడ్ గోడలు మళ్లీ కుంగిపోయాయి. ఇప్పటికే పలుసార్లు మరమ్మతులు చేయించినా నిలువకపోవడంతో ఎప్పుడు గండి పడుతుందో తెలియని పరిస్థితి ఉంది. ఇసుక సంచులు పేర్చి తాత్కాలిక మరమ్మతు పనుల కోసం సుమారు రూ.80 లక్షలు గత ప్రభుత్వంలో పనులు జరిగాయి.

పనిచేసిన చోట కాకుండా మరో సైడ్ గోడ కూడా మట్టి కృంగిపోయింది. చెరువు సైడ్ గోడలు 250 మీటర్లు రాళ్లతో పరుపుపరిచి పట్టిష్టం చేయాలని అధికారులు నిర్ణయం తీసుకున్నారు. అమృతఫేస్ 2 కింద రూ.20 కోట్లు మంజూరు అయినట్లు అధికారులు చెబుతున్నారు. రూ. 10 కోట్లు సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ పటిష్ట పనులకు వినియోగిస్తామని చెబుతున్నారు. ఇప్పటికే టెక్నికల్ శాంక్షన్ వచ్చిందని త్వరలోనే పనులు చేపట్టి చెరువు మరమ్మతులు చేయిస్తామని చెబుతున్నారు.

నీటి వధా చేయవద్దు: లోకేశ్వరి మున్సిపల్ చైర్మన్

ఆదోని పురవాసులకు తాగునీటి ఎద్దడి రాకుండా జాగ్రత్తలు తీసుకుంటాం. కుళాయిల ద్వారా నీరు సరఫరా సక్రమంగా జరిగేలా చూస్తాం. అవసరం మేరకే నీటిని నింపుకొని నిలువ చేసుకోవాలి. కొందరు కాలువలకు మంచినీరు వదలడం వల్ల వృధా అవుతున్నాయి. ప్రస్తుతం నెలకు సరిపడు నీరు చెరువులో నిలువ ఉంది. దీన్ని దృష్టిలో పెట్టుకొని తాగునీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ట్యాంకులో నీరు పూర్తిగా తగ్గక ముందే త్వరలోనే తుంగభద్ర డ్యాం బోర్డు అధికారులకు సంప్రదించి కాలువ ద్వారా నీటిని వదిలేలా చూస్తాం. ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

యోగాను దినచర్యగా ఆచరించాలి

- సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ప్రజాశక్తి - ఆదోని: యోగాను ప్రతి ఒక్కరు దినచర్యగా ఆచరిస్తూ ప్రశాంతంగా గడపాలని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ తెలిపారు. యోగాంధ్ర మాసోత్సవాల్లో భాగంగా సీనియర్ సిటిజన్స్‌తో ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో మున్సిపల్ కమిషనర్ కృష్ణ తాసిల్దార్ శివ రాముడు, ఎంపీడీవో రాజేంద్రప్రసాద్‌తో కలిసి యోగ ఆసనాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఆధునిక టెక్నాలజీ యుగంలో పని ఒత్తడి కారణంగా మానసిక శారీరక ఒత్తిడి కిలోనై రుగుమతలకు లోనవుతున్నామన్నారు ప్రతిరోజు వ్యాయమం చేస్తూనే యోగ కోసం సమయం కేటాయించుకోవాలన్నారు. యోగ చేయడం వల్ల మానసిక ప్రశాంతత శారీరక ఒత్తిడి తొలగి మనసు ప్రశాంతంగా ఉంటుందన్నారు. మనిషికి ఆరోగ్యం మించిన భాగ్యం లేదని పేర్కొన్నారు. యోగ ప్రాముఖ్యత తెలిపేందుకు యోగా వారోత్సవాల్లో భాగంగా సీనియర్ సిటీజన్లతో యోగ ఆసనాలు చేయించడం జరిగిందన్నారు. ఈనెల 21న యోగా దినోత్సవం ఘనంగా నిర్వహించాలని అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ప్రతి ఒక్కరు హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు. ఉప తహశీల్దారు వలి భాష, మున్సిపల్ ఆర్ఐ చంద్రమోహన్, యోగాభ్యాసకులు పాల్గొన్నారు.

-యోగాలో సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, ఇతర అధికారులు

టిడిపి దాడిలో గాయపడిన వైసిపి నాయకులు, న్యాయవాది గురురాజారావు

వైసిపి నేత గురురాజా రావు పై టిడిపి దాడి

ప్రజాశక్తి-మంత్రాలయం

మండల పరిధిలోని మాలపల్లిలో వైసిపి నాయకులు న్యాయవాది గురురాజారావు పై టిడిపి నాయకుడు మాజీ జడ్‌పిటిసి సభ్యులు ఆర్ లక్ష్మయ్య తన వర్గంతో రాళ్లతో దాడి చేసినట్లు మాధవరం పోలీస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆదివారం మృతి చెందిన చాకలి నాగరాజు అంత్యక్రియలకు వెళుతుండగా నాపై మూకుమ్మడిగా దాడి చేశారని చెప్పారు. ఈ విషయం పై ఎమ్మిగనూరు బార్అసోసియేషన్ మాజీ అధ్యక్షులు న్యాయవాది గురురాజరావు మాట్లాడుతూ నాలుగు రోజుల క్రితం టిడిపి మాజీ జడ్‌పిటిసి లక్ష్మయ్య ఇంట్లో నకిలీ పత్తి విత్తనాలను నేనే విజిలెన్స్ అధికారులకు సమాచారం అందించి పట్టించాననే అనుమానంతో తన సోదరులతో దాడికి దిగారని తెలిపారు. ఎన్నికల ముందు వైసిపి నుండి టిడిపి లోకి మారారని తెలిపారు. తనకు వారి నుంచి ప్రాణ హాని ఉందని వారి పై కేసు నమోదు చేసి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. ఇద్దరి మధ్య 2014 నుంచి భూమిగొడవలున్నాయి.

దూషించినందుకే గురురాజా రావుతో గొడవ

టిడిపి నాయకులు ఆర్ లక్ష్మయ్య

మంత్రాలయం: వైసిపి నాయకులు గురురాజరావు తమను దూషించడం వల్లే గొడవ జరిగిందని టిడిపి నాయకులు మాజీ జడ్‌పిటిసి ఆర్.లక్ష్మయ్య తెలిపారు. ఆదివారం చాకలి నాగరాజు మృతి చెందగా అంత్యక్రియలకు బైక్ లపై వెళ్తుండగా వెనుక వైపు నుంచి వస్తున్న గురురాజారావు ఎక్కడికి వెళు తున్నార్రా గొజ్జా నాయళ్ళారా అంటూ వైసిపి నుండి టిడిపి లోకి ఎలా వెళ్లావురా అంటూ నానా దుర్భాషలాడారన్నారు. వారి అనుచరులతో దాడి చేశారని గాయాలైనా తన సోదరుడిని ఆదోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని తెలిపారు. మాధవరం పోలీస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

వివాహ వేడుకలో ఎమ్మెల్యే, కుటుంబ సభ్యులు

ప్రజాశక్తి - మంత్రాలయం : వైసిపి నాయ కులు, ఉరుకుంద ఈరన్న స్వామి దేవస్థానం పాలక మండలి మాజీ సభ్యులు జగదీష్ స్వామి కుమార్తె వివాహ వేడుకలో ఎమ్మె ల్యే వై.బాలనాగిరెడ్డితో పాటు కుటుంబ సభ్యులు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఆది వారం స్థానిక హెచ్ఆర్‌బి కళ్యాణ మండపంలో నిర్వహించిన ఈ వివాహ వేడకలో వధూవరులు శ్వేత, చైతన్య బసవరాజులను ఆశీర్వదించారు. ఎమ్మెల్యే సోదరులు వై సీతారామి రెడ్డి సతిమణీ, ఎంపిపి వై గిరిజమ్మ, ఎమ్మెల్యే సతీమణి వై జయమ్మ, సీనియర్ నాయకులు బాబురెడ్డి, ఎమ్మెల్యే కూతురు, అల్లుడు ప్రియాంక, వివేక్ రెడ్డి పాల్గొన్నారు. ఎమ్మెల్యేకు పూలు,శాలువతో సన్మానించారు.

వివాహ వేడుకలో ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి కుటుంబం

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులకు అభినందన

శమంతకమణి , రాఘవేంద్ర శుభాకాంక్షలు

ప్రజాశక్తి-కర్నూలు జిల్లా పరిషత్

రాష్ట్ర తైక్వాండో పోటీలకు ఎంపికైన కర్నూలు జిల్లా విద్యార్థులకు సన్ టీవీ బంకెట్ హాల్‌లో అభినందన సభ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ నగరూరు శమంతకమణి, సన్ టీవీ డైరెక్టర్ నగరూరు రాఘవేంద్ర హాజరయ్యారు. జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన సబ్ జూనియర్, క్యాడెట్, జూనియర్, సీనియర్ విభాగాలకు చెందిన 45 మంది విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, ప్రోత్సాహక పథకాలు అందజేశారు. నగరూరు శమంతకమణి మాట్లాడుతూ, కర్నూలు విద్యార్థులు తైక్వాండో క్రీడలో అద్భుత ప్రతిభను కనబరుస్తున్నారు. ఈ క్రీడ శారీరక ధైర్యం, మానసిక స్థైర్యాన్ని పెంపొందించడంతో పాటు, స్పోర్ట్స్ కోటాలోనూ అవకాశాలు కల్పిస్తోందిని అన్నారు. ఈ నెల 9, 10, 11 తేదీల్లో అనంతపురం జిల్లా తాడిపత్రిలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థులు కర్నూలుకు మరింత కీర్తి తీసుకువస్తారని ఆకాంక్షించారు. అంతకుముందు ఓవరాల్ గ్రాండ్ ఛాంపియన్‌షిప్ తొలి బహుమతిని కర్నూలు విద్యార్థులకు అందజేస్తూ, సన్ టీవీ డైరెక్టర్ రాఘవేంద్ర తైక్వాండో ఇన్‌చార్జ్ సెక్రటరీ సతీష్ కుమార్‌ను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ ఫిట్నెస్ అండ్ సెల్ఫ్ డిఫెన్స్ అకాడమీ అధ్యక్షురాలు సోమేశ్వరి, మాస్టర్లు వీరేష్ బాబు, శివన్న, కామర్తి భరత్, టిఎం గాయత్రి, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయికి ఎంపికయిన విద్యార్థులను అభినందిస్తున్న శమంతకమణి, రాఘవేంద్ర

మహిళలను అవమానించిన వారిపై పోలీసులకు ఫిర్యాదు

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

అమరావతి రాజధాని గురించి, రాజధాని మహిళలను ఉద్దేశించి సాక్షి టివి డిబేట్‌లో కొమ్మినేని శ్రీనివాసరావు, కృష్ణం రాజు కించపరిచేలా మహిళల శీల హననం చేసి తప్పుడు మాటలు మాట్లాడడాన్ని తీవ్రంగా ఖండిస్తూ కర్నూలు మహిళ కమిటీ అధ్యర్వంలో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎపి టూరిజం కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ ముంతాజ్, కమిటీ అధ్యక్షులు మారుతి శర్మ, రాజ్యలక్ష్మి, మున్ని, శాంతమ్మ, సుశీలమ్మ, అనిత లక్ష్మి, లలిత కుమారి, రేణుక కలిసి కర్నూలులోని 1 టౌన్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేయించామన్నారు. ఫిర్యాదు చేశారు. మహిళలను దారుణంగా అవమానించిన జగన్, కొమ్మినేని, కష్ణంరాజు తక్షణమే మహిళా లోకానికి క్షమాపణలు చెప్పాలని మహిళలు పల్లవి, సరస్వతి, అంజలి, ప్రభావతి, రాణమ్మ మల్లేశ్వరి టిడిపి నాయకులు అశోక్ రెడ్డి , ఇంచార్జి వరదరాజులు ఆర్కే రాఘవేంద్ర, మాణిక్యం రాజు, గురురాజ్ ఫిర్యాదు చేసిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా

కర్నూలు వన్‌టౌన్ లో ఫిర్యాదు చేస్తున్న షేక్ ముంతాజ్ , తదితరులు

జర్నలిస్ట్ కృష్ణంరాజు, కొమ్మినేని శ్రీనివాసరావు పై మహిళల ఫిర్యాదు

మంత్రాలయం: అమరావతి మహిళలను వేశ్యలతో పోల్చిన జర్నలిస్ట్ కృష్ణంరాజును అరెస్టు చేయాలని మహిళలు డిమాండ్ చేశారు. ఆదివారం మంత్రాలయం పోలీస్టేషన్ లో వారు మాట్లాడుతూ అమరావతి ప్రాంత మహిళలను అంత నీచంగా మాట్లాడడం ఏంటని మీ ఇంటి మహిళలను అలాగే మాట్లాడుతారా అంటూ ప్రశ్నించారు. మీ ఇంటి ఆడపడుచులను కూడా వేశ్యలుగా చూస్తున్నారా అంటూ తమ ఆగ్రహం వెలిబుచ్చారు. మీరు నాశనం చేయాలనుకున్న రాజధాని అమరావతి మళ్ళీ పునర్నిర్మాణం చేసుకుంటుంటే జగన్‌కు రోజూ అన్నం బదులు విషం మింగుతున్నట్టు ఉందని విమర్శించారు.

మంత్రాలయంలో ఫిర్యాదు చేస్తున్న టిడిపి నేతలు, మహిళలు

ఇంపి సెట్ ఫలితాల్లో నారాయణ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-ఎమ్మిగనూరు

ఇంటర్ ఇంప్రూవ్మెంట్ ఫలితాల్లోనూ, ఇఎపిసెట్ ఫలితాల్లోనూ ఎమ్మిగనూరు పట్టణానికి చెందిన నారాయణ విద్యార్థులు ప్రతిభ చాటారు. ఆదివారం ఎంసెట్ ఫలితాల్లో ర్యాంకు సాధించిన విద్యార్థులకు నారాయణ విద్యాసంస్థల కోర్‌డీన్ లింగేశ్వర్‌రెడ్డి, కళాశాల ఎజిఎం రమణారెడ్డి, ప్రిన్సిపల్ రామ్మోహన్ రెడ్డి అభినందించారు. ఎపి ఇఎపి సెట్ ఫలితాలలో ఇంజనీరింగ్ భాగంలో ఎం.శివాని7974 ర్యాంక్ జి గాయత్రి 10505, ఎస్.హేమ ప్రియ 10844, బి.లక్ష్మీ ప్రసన్న11589, కె శ్రీహర్షిని14593, బి.లిఖిత15387, మహమ్మద్ సైఫ్,18942 ర్యాంకులు సాధించారు. మెడిసిన్ విభాగంలో పి.నికిత శ్రీ 4087 మరెన్నో ర్యాంకులు వచ్చాయని అన్నారు. ర్యాంకులు సాధించిన విద్యార్థిని విద్యార్థులకు తల్లిదండ్రులకు బోధన సిబ్బందికి అభినందించారు. ఈ కార్యక్రమంలో నారాయణ విద్యాసంస్థల డిజిఎం గోవర్ధన్‌రెడ్డి, డీన్‌లు వెంకటేశ్వర్లు , ఆంజనేయ రెడ్డి, ఎఒ తిమ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.





ఆర్థికసాయం చెక్కును బాధితురాలికి అందజేస్తున్న ఎమ్మెల్యే విరుపాక్షి

కార్యకర్తలకు అండగా ఉంటాం

- ఎమ్మెల్యే విరుపాక్షి

ప్రజాశక్తి - హాలహర్వి

మండలంలోని గూళ్యం గ్రామ వైసీపీ వైస్ ఎంపీపీ వన్నూరప్ప తనయుడు ఇటీవల విద్యుత్ షాక్ తో మరణించడం తో వారి కుటుంబానికి మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి ఆదేశానుసారం వారి కుటుంబానికి ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి రూ.లక్ష ఆర్థిక సాయం అందించారు. వారి కుటుంబానికి ఎల్లప్పుడూ తమ పార్టీ అండగా ఉంటుందని ఎమ్మెల్యే తెలిపారు. ఎమ్మెల్యేతో పాటు కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, వైసీపీ మండల కన్వీనర్ రామిరెడ్డి, మాజీ కురువ కార్పొరేషన్ డైరెక్టర్ బజారప్ప, తిప్పారెడ్డి, జనార్ధన్ నాయుడు ఉన్నారు.

టిడిపి నాయకునికి మాధవరావు దేశాయ్ పరామర్శ

ప్రజాశక్తి - నందవరం

గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న టిడిపి నాయకులు నల్లరెడ్డిని మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ మాధవరావు దేశయ్ పరామర్శించారు. ఆయన ఆదివారం ఎమ్మిగనూరు సాయిరాం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నల్లారెడ్డిని పరామర్శించి మనోధైర్యాన్ని కల్పించారు. ఆయన కుటుంబ సభ్యులను ఆరోగ్య పరిస్థితిపై అడిగి తెలుసుకున్నారు. నల్లారెడ్డికి అండగా ఉంటామని ఆయన తెలిపారు.

సామాజిక వేత్త ఆల్ఫ్రెడ్ రాజు జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

సామాజిక వేత్త, ప్రముఖ వ్యాపార వేత్త, రాష్ట్ర దివ్యాంగుల సంక్షేమ సేవా సంఘాల గౌరవాధ్యక్షులు, మల్లేల గ్రూపు అధినేత మల్లెల ఆల్ఫ్రెడ్ రాజు జన్మదిన వేడుకలు వికలాంగుల కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. జన్మదినాన్ని పురస్కరించుకొని పురస్కరించుకొని వికలాంగ పోరాట సమితి నాయకులు నాగరాజు మాట్లాడుతూ దివ్యాంగుల సాధికారత కోసం, వారి సంక్షేమ పథకాలు అమలు ఎంతో కషి చేశారని ఇలాంటి వ్యక్తి నిండు నూరేండ్లు సంతోషంగా ఉండాలని మనస్ఫూర్తిగా కోరుతూ రాబోయే రోజుల్లో కూడా ఆయన సేవలను ప్రభుత్వం గుర్తించి పద్మ శ్రీ అవార్డు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆల్ఫ్రెడ్ రాజు చేతుల మీదుగా కేకు కట్ చేసి స్వీట్స్ పంచుకుని సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మిగనూరు నియోజకవర్గంలోని డిఈఎఫ్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

అభిమానుల మధ్య కేక్ కట్ చేస్తున్న ఆల్ఫ్రెడ్‌రాజు